కథా నిలయం
5222
శ్రీకాకుళం

# కొత్త బంధం

వెంకట్రామయ్యగారు పడక కుర్చీలో పడుకుని కళ్లు మూసుకున్నారు. పన్నెండు గంటలు కావస్తూన్నా కోడలు వంట పూర్తి చేయలేదింకా. వంటగదిలో సంపూర్ణ చేసే గిన్నెల శబ్దం వినిపిస్తూనే ఉంది.

వెంకట్రామయ్యగారు ఉద్యోగం చేసే రోజుల్లో పది గంటలకే భోజనం చేసే అలవాటు. రిటైరైన తరవాత పన్నెండింటికి మార్చుకోవాలంటే చాలా బాధగానే ఉంది. కొడుకు శ్రీధర్‌కి కంపెనీలో ఉద్యోగం. ఎనిమిదింటికి వెళ్ళి పన్నెండున్నరకి వస్తాడు గనక కోడలు సావధానంగా వంట చేస్తుంది. వెంకట్రామయ్యగారి భార్య వరలక్ష్మమ్మ గనక ఊళ్ళో ఉంటే పది గంటలు దాటకుండానే వంటగది గడపలో నిలబడి, "ఇంకా వంట కాలేదూ? త్వరగా కానివ్వూ" అంటూ త్వరపెట్టేసి, భోజనం కానిచ్చేసి, కాస్సేపు మంచం

మీద వాలి, కొడుకు భోజనానికి వచ్చేసరికి చిన్న కునుకు కూడా తీసేవారు.

పదిహేను రోజుల క్రితం రెండో కూతురు ప్రసవించే రోజులనీ, అమ్మని పంపితే ఓ మూడు నెలలు ఉండి వస్తుందనీ ఉత్తరం వ్రాయటంతో ఆవిడని అక్కడికి పంపక తప్పలేదు. ఆవిడ లేకుంటే తనకి చాలా ఇబ్బందని వెంకట్రామయ్యగారికి తెలుసు. అయితే, ఆడపిల్లని అసలు పురిటికి పుట్టింటికే తీసుకురావాలి. అదెలాగూ వీలు పడదు. తనా రిటైరై కొడుకుల మీద ఆధారపడ్డారు. వాళ్ళని ఈ పట్నవాసంలో ఎందుకు ఇబ్బంది పెట్టాలని కూతురి అవసరం కోసం భార్యనే పంపేసి తనెలాగో సరిపెట్టుకుంటూ వున్నారు.

వెంకట్రామయ్యగారు ఉద్యోగంచేసే రోజుల్లో క్షణం విశ్రాంతి లేక—అబ్బ! ఎప్పటికి సర్వీసు అయిపోతుందో? హాయిగా ఆఫీసు పీడ లేకుండా రిటైరయిన తరవాత స్వేచ్ఛగా ఎనిమిది గంటలకి నిద్ర లేవచ్చు. ఇంకా ఇంకా యెన్నో చెయ్యొచ్చని కలలు కన్నారు. కాని, తీరా విశ్రాంతి దొరికేసరికి కాలక్షేపం కాక మహా అవస్థ పడవలసి వస్తోంది. వరలక్ష్మమ్మగారు లేకుంటే ఇంట్లో అసలే తోచదు.

"అబ్బ! వెధవ ఆకలి ప్రాణం తీస్తోంది. అయినా, ఈ సంపూర్ణ వంట ఎంతకీ కాదు!" తనలో తనే విసుక్కుంటూన్న వెంకట్రామయ్యగారికి వాకిట్లోనించి పాట శ్రావ్యంగా వినిపిస్తోంది.

"మనసే కోవెలగా! మమతలు మల్లెలుగా" పాట చాలా బాగుంది అనుకుంటూ లేచి వాకిలి తలుపు తీసుకుని బయటికివచ్చి నిలుచున్నారు. నల్లగా, సన్నగా, పొడుగ్గా దాదాపు అస్థిపంజరంలా ఉన్న ఓ ముప్ఫైఏళ్ళ స్త్రీ గొంతు చించుకుని పాడుతూంది. మధ్య మధ్య పాడలేక ఆగి పోతూంటే నడివయస్సులో ఉన్న అతను తాడుతో హార్మనీ భుజానికి తగిలించుకుని పాట ఆగిన విరామ సమయంలో హార్మనీ వాయిస్తూ చరణం అందిస్తూన్నాడు. ఆ స్త్రీ గొంతు ఎంత బాగుందో, ముఖం అంత అసహ్యంగా ఉంది. స్ఫోటకం మచ్చలతో జిడ్డోడుతూ ఉంది. మధ్య మధ్య ఖంగు ఖంగున దగ్గుతూ, అంతలోనే చరణం అందుకుంటూంది. ఆమె ముఖం చూడకుండా పాట వింటూంటేనే బాగుంది అనుకుంటూ ఓ అడుగు వెనక్కి వేశారు.

'మనసే కోవెలగా...మమతలు మల్లెలుగా ..యీ సాహిత్యం ఎంత బాగుందీ.. మనసు కోవెలా కాదు... యాంత్రికంగా బ్రతికే ఈనాటి మనిషి గుండెకి మమతల మాధుర్యం గ్రహించే శక్తి ఉందా? మారిపోతూంది సమాజం.' నిట్టూర్చారు వెంకట్రామయ్యగారు.

"అమ్మా...ధర్మం చెయ్యండి. అయ్యా, ధర్మం బాబూ..." వాళ్ళ గొంతులు మరీ ఖంగుమంటూన్నాయి. వెంకట్రామయ్యగారు జేబులో చెయ్యిపెట్టి వెతికితే ఓ పది పైసలబిళ్ళ తగిలింది. అది తీస్తూండగా అంతవరకూ వెనక గడపలో నిలిచి పాట అంతావిన్న సంపూర్ణ—"పొండి... పొండి" అంటూ లోపలి కెళ్ళింది.

వెంకట్రామయ్యగారి వేళ్ళలో ఉన్న పది పైసల బిళ్ళ అలాగే ఉండిపోయింది. పాపం పేదవాళ్ళు! గొంతు చించుకొని పాడితే హాయిగా విని ఓ పది పైసలో, కాసిని బియ్యమో పెడితే పోలే? ఏమిటో, రానురానూ దాన ధర్మాలు తగ్గిపోతూన్నాయి. ఈ ముష్టివాళ్ళకి ఇంటింటికి పది పైసలు వేసినా, అలాంటి ఎన్ని పదిపైసలు రూపాయి కాను! రూపాయికి ఈనాడు విలువ ఎంత ఉంది? దాన్ని మార్కెట్టుకు తీసుకువెడితే సంచీలోకి ఏం వస్తుంది?

ఆయన అలోచిస్తూ నిలుచునే వున్నారు. భిక్షుగాళ్ళిద్దరూ ఆశగా, అయిదు నిమిషాలు ఆయన వంక చూసి లాభం లేదనుకున్నారు కాబోలు, వెళ్ళిపోయారు.

"నాన్నా, భోజనం చేశారా?" కంపెనీ నించి వచ్చిన కొడుకు పలకరించేవరకూ ఆయన గమనించనేలేదు. శ్రీధర్ ప్రతి రోజూ కంపెనీ నుంచి వస్తూ వేసే ప్రశ్నే అది.

"ఆఁ... ఎలాగూ నువ్వు వచ్చే టైము అయింది కదూ అనీ..."

మిగతా మాట మింగేస్తా రాయన. శ్రీధర్‌కి తండ్రి ఆకలికి ఆగలేడని బాగా తెలుసు. భార్య వంట లేటు చేస్తుం దన్న కోపంతో గబగబా లోపలికెళ్ళి మందలిస్తూన్నాడు. అదేదీ వినిపించుకోనట్లు, తువ్వాలు తీసుకుని కాళ్లు కడుక్కునేందు పెరట్లోకి వెళ్ళిపోయారు వెంకట్రామయ్య గారు

తండ్రీ కొడుకు లిద్దరూ భోజనం చేసేశారు. ఇంక

పగలు నిద్రకి ఉపక్రమిస్తూండగా కాస్త దూరంనించి మళ్ళీ పాట వినిపిస్తూంది. "మనసే కోవెలగా! మమతలు మల్లెలుగా!" పాట మధ్య మధ్యలో ఆగిపోతూ ఖంగు ఖంగున దగ్గు కూడా వినిపిస్తూంది.

పోనీ, ఓ పావలా కాసు వాళ్ళ దగ్గరికే వెళ్ళి ఇచ్చి వస్తే—అన్న ఆలోచన వచ్చింది. కానీ, జేబులో రెండు రూపాయల కాగితం తప్ప మరి చిల్లర లేదు, పది పైసలు మినహా. 'పోనివ్వు, రేపు తప్పకుండా వేస్తేసరి...కాదు... ఈవేళే...ఇస్తాను... ఈ రెండు రూపాయలూ!' వెంకట్రామయ్యగారు పర్సు తీసుకుని చెప్పులు తొడుక్కుంటూ వుండగా శ్రీధర్—"ఎక్కడికింత ఎండలో, నాన్నా? వక్కపొడి కావాలా? నే తెస్తాను" అంటూ వచ్చాడు. అది కాదనీ, తను వాళ్ళకి రెండు రూపాయలు ఇవ్వటానికి వెడుతూన్నాననీ పైకి చెపితే ఇంకా ఏమన్నా ఉందా! అందుకే — "ఏం లేదులే ... ఏం అక్కరలేదు ... నువ్వు విశ్రాంతి తీసుకోరా" అంటూ చొక్కా విప్పి వంకెన తగిల్చి, మంచం మీద వాలారు. ఏమిటీ అస్వతంత్రత... వాళ్ళ దగ్గర ఉన్నప్పుడు వాళ్ళ అభిప్రాయాలకి అనుగుణంగా నడుచుకుంటే, ప్రశాంతంగా గడుస్తాయి రోజులు. లేకుంటే ఘర్షణ తప్పదు. అది ఇష్టంలేని వెంకట్రామయ్యగారు, ఆలోచనలు ఆపేసుకుని పాట పాడిన అమ్మాయిని గురించి ఆలోచిస్తూన్నారు.

ఇంత బాగా పాడగలిగిన ఈ అమ్మాయికి ఏ సిని

మాలోనన్నా అవకాశం ఎందు కివ్వకూడదు? ఎవరన్నా ప్రయత్నించి అవకాశం ఇప్పిస్తే ఎంత బాగుంటుంది! ఇలాంటి మట్టిలో మాణిక్యాలు ఈ దేశంలో యెన్ని వున్నాయో? కానీ, ఇలాంటి వాళ్ళ కలాంటి అవకాశం రాదు. ఇది జరగదు. ఏం, ఎందుకు జరగదు? ప్రయత్నిస్తే? ఎవరు ప్రయత్నిస్తారు?

పూటకో ముద్ద సంపాదించుకోలేని ఆమె ప్రయత్నించగలదా? పోనీ, అతను... ఊహూఁ లాభంలేదు. అతని ముఖంలో ఏదో నిర్లిపత. బహుశా బ్రతికి చెడ్డవాడు కావచ్చు. ఇలాంటివాళ్ళెందరో ఈ ప్రపంచంలో. అలాంటి వాళ్ళని చూసి ఎవరు జాలి పడతారు? అసలు పక్కవాడి కష్టసుఖాలు ఆలోచించగలిగిన తీరుబడి ఎవరి కుంది!

కాలం చాలా మారిపోతూందో, లేక మనుషులే మారిపోతున్నారో తెలుసుకోవటం కష్టంగానే ఉంది. అయితే, ఒక్కటి మాత్రం నిజం. డబ్బు...డబ్బు... ఈనాడు సమాజాన్ని నడిపినున్నది డబ్బు దాంతోనే మనిషి మంచిచెడ్డలు బేరీజు వేస్తూన్నా రీనాటి మనుష్యులు. ఆదర్శాలూ, ఆశయాలూ ఉన్న వ్యక్తులు 'కలికం' వేసి వెతికినా కనిపించటంలేదు పాపం! ఆ పాట పాడే అమ్మాయి ఆరోగ్యం కూడా అంత బాగా లేదులా ఉంది అలా దగ్గుతూందేమిటి, పాపం? సాయంత్రం అలా షికారు వెళ్ళినప్పుడు వాళ్ళెక్కడన్నా కనిపిస్తే ఈ రెండు రూపాయలూ ఇచ్చేయాలి...అవును...ఇచ్చేయాలి...

ఆయనకి ఆలోచనల్లో ప్రతి రోజూలా నిద్ర రావటం

లేదు. అప్పుడే శ్రీధర్‌కి మళ్ళీ టైమ్ అయినట్లుంది - బట్టలు వేసుకుని తండ్రి దగ్గరి కొచ్చి "నాన్నా, ఈవేళ సాయంత్రం నేనూ, సంపూర్ణా సినిమాకి వెళ్ళాలనుకొంటున్నాం. షికారు వెళ్ళకుండా ఇంట్లో ఉన్నా సరే... లేకుంటే త్వరగా తిరిగి వచ్చేసినా సరే" అన్నాడు షర్టు బటన్సు పెట్టుకుంటూ.

"అలాగేరా! త్వరగా ఇంటికి వచ్చేస్తాలే..." అనటంతో శ్రీధర్ "సరే" అంటూ వెళ్ళిపోయాడు.

* * *

కోడలు అందించిన టీ తాగి, నాలుగు గంటలకి కాస్సేపు పెరటి తోటలో మొక్కలకి కాలువలూ కుదుళ్లూ సరిచేసి, నీరు పెట్టి, కాళ్ళూ చేతులూ కడుక్కుని, ఉత్తరీయం భుజాన వేసుకుని, షికారుకి బయలుదేరారు.

ఇలా ప్రతిరోజూ క్రమం తప్పకుండా పార్కుకొచ్చే ఈ తాతగారిని చూస్తున్న ముగ్గురు పిల్లలు కొత్తలో మాట్లాడించకున్నా, క్రమంగా దగ్గర చేరి వాళ్ళ దొంగాటకి కళ్ళు మూసే బాధ్యతని ఆయన కిచ్చి, ఆడుకునే బాల్‌నీ, రింగ్‌నీ దాచమనీ, అలా అలా అలవాటైపోయారు ఆ ముగ్గురు మగపిల్లలనీ వెంకట్రామయ్యగారు ఒక్క రోజైనా చూడందే వుండలేరు. తాతయ్యని చూడందే వాళ్ళూ వుండలేరు. గోపీ, శేషగిరీ పదేళ్ళ వాళ్లు. శ్యామ్‌కి మాత్రం ఆరేళ్ళే అయినా, గోపీకి శేషగిరితో చాలా దోస్తీ

ఈరోజు శేషగిరీ, గోపీ మాత్రమే తాతగారి రాక కోసం ఎదురు చూస్తున్నారు.

"'శ్యామ్' రాలేదేం, బాబూ?" అడిగారు వెంకట్రామయ్యగారు.

"శ్యామ్‌కి జ్వరం వచ్చింది తాతగారూ! తగ్గిన తరవాత ఆటకి వస్తానని మీకు చెప్పమన్నాడు."

"పాపం! వాళ్ళమ్మ చాలా భయపడుతోందండీ."

"అలాగా! వాళ్ళిల్లు ఎంత దూరం ఇక్కడికి? వాళ్ళ నాన్నగారేం చేస్తూవుంటారు?"

ఇన్నాళ్ళుగా ఈ పిల్లలతో పరిచయం ఉన్నా, వాళ్ళ వివరాలు మాత్రం ఆయన యెన్నడూ అడగలేదు. ఈ రోజు శ్యామ్‌గురించి తెలుసుకోవాలని అడిగారు.

"శ్యామ్‌కి నాన్న లేడండీ. అమ్మ ఒక్కతే... వాళ్ళకెవరూ చుట్టాలు కూడా లేరు. అసలు వాళ్ళింటికి ఎవరూ వెళ్ళరు. ఆవిడ ... అదే ... శ్యామ్ వాళ్ళ అమ్మకి పెళ్ళి కాకుండానే ..వీడుపుట్టాడట...మా అద్దెలకున్నవాళ్ళంతా ఏదేదో చెపుతారు కానీ, మాకు సరిగా తెలియదు. శ్యామ్ అంటే మాకు చాలా ఇష్టం. అందంగా ముద్దుగా ఉంటాడు కదూ, తాతగారూ! అసలు అల్లరిచెయ్యడు. బొమ్మలాగా కూర్చుని కళ్ళతో చూస్తూ వుంటాడు. వాడి ముక్కు బలే బాగుంటుంది కదండీ...ఒరే, శ్యామ్! ఒక్క ముద్దివ్వరా అంటే రెండిస్తాడు." శేషగిరీ, గోపీ ఏదేదో చెపుతూ వున్నారు. కానీ, వెంకట్రామయ్యగారి బుర్రలోకి అవన్నీ ఎక్కటంలేదు.

"శ్యామ్ ... తల్లి .... పెళ్ళికాకుండానే కొడుకుని

కన్నదా? పాపం! వయస్సులో దూరదృష్టి లేక యిలాంటి యెందరు ఆడపిల్లలు చెడిపోతున్నారో? శ్యామ్‌లాంటి పిల్లల భవిష్యత్తు, అందులో యీ సమాజంలో యెలాంటి స్థితిలో వుంటుంది? డబ్బువుంటే యిలాంటివెన్నో కప్పిపడిపోయే నేటి సమాజంలో అతి సామాన్యురాలు అయిన శాంత జీవితం అలావుంచి శ్యామ్ భవిష్యత్తు...ఎలా వుంటుంది?

శ్యామ్ చాలా తెలివైనవాడు. గోపీ, శేషగిరీ దూరంగాపోయి ఆడుకుంటూవుంటే తాతగారిదగ్గరకూర్చుని యెన్నెన్నో ప్రశ్నలు వేస్తూ వుండేవాడు

"తాతగారు! ఆకాశంలో అన్ని చుక్కలెందు కున్నాయి? మనం వాటిని తీసుకోగలమా? దేవుడంటే ఎవడండీ—అస లెక్కడుంటాడూ? మనకి కనిపిస్తాడా? ఏద యినా కావాలంటే యిస్తాడా? గుడిలో వున్నవాడు నిజంగా దేవుడే నంటారా?" ఇలా యెన్నో సందేహాలు వెలిబుచ్చే వాడు. వాటి కన్నింటికీ ఓపిగ్గా సమాధానం చెప్పే యీ తాతగారంటే శ్యామ్‌కి చాలా చాలా ఇష్టం. మొదట మొదట కాలక్షేపంగా అయిన వీళ్ళ పరిచయం వెంకట్రా మయ్యగారికి విడదీయని బంధంలా అయింది. ఒక్కొక్క రోజు ఆ పార్కుకి వెళ్ళకుంటే ఆ కుర్రాళ్ళుముగ్గురూ తాత గారికోసం యెదురు చూసి చూసి నిరాశగా యింటిముఖం పడతారు.

"ఇంకాస్సేపు చూద్దాంరా శేషూ... తాతగారువస్తారేమో" అంటూ శ్యామ్ వాళ్ళచేతివిదిలించుకుంటూ వెనక్కి వెనక్కి చూస్తూ యింటి కెడతాడు. మరునాడు రోజూ కన్నా త్వరగానే అటు ఆ పిల్లలు ముగ్గురూ, ఇటు వెంకట్రామయ్యగారూ పార్కుకి చేరుకుని నిన్న ఎందుకు రాలేకపోయిందీ తాతగారూ, ఆయన రానందుకు తమకి యెంత బాధ కలిగిందీ వీళ్ళు ముగ్గురూ చెప్పుకున్న తర్వాతగానీ వాళ్ళ నలుగురి మనస్సులూ కుదుటపడవు. శేషగిరీ, గోపీ కాస్త పెద్దవాళ్ళుగనక అంతగా తాతగారు అంటూ గొడవ పెట్టరు. కానీ, శ్యామ్మాత్రం తాతయ్యని చూడందే... ఆ రోజు యేదో పోగొట్టుకున్నవాడిలా బాధపడిపోతాడు.

"తాతగారూ, మనం ముగ్గురం ఆడుకుందాం అండీ."

గోపీ ఆటలకి సిద్ధమైనాడు. కానీ, వెంకట్రామయ్యగారు పరధ్యాసలోపడి సరిగ్గా జవాబివ్వలేదు. ఆ యిద్దరే కాస్సేపు ఆడుకుని, "తాతగారూ, వర్షం వచ్చేలావుంది. మీరీ రోజు అదోలా వున్నారు. మేం ఇంటికి వెళ్ళిపోతాం. మరి మీరూ త్వరగా ఇంటికెళ్ళిపొండి, లేకుంటే తడిసిపోతారు" అంటూ యింటివేపు పరుగుతీశారు గోపీ, శేషూ.

వెంకట్రామయ్యగారికి ఇంటికి అప్పుడే వెళ్ళాలనిపించడంలేదు. శ్యామ్ మాటిమాటికీ గుర్తు వస్తున్నాడు. ఎలా

వున్నాడో, ఎంత కష్టపడి పెంచితే ఇంతవాళ్ళు అంత కాను! వీళ్ళు పెరిగి పెద్దవాళ్ళయిన తరువాత...ఆ జీవితం మరోలా వుంటుంది. తనూ, తన పిల్లలూ, వాళ్ళ భవిష్యత్తుకోసం తనుపడ్డ ఆరాటం...ఆడపిల్లల పెళ్ళిచేయటానికి యెంత కష్టపడ్డా అల్లుళ్ళకి సంతృప్తి లేకపోవటం.. ఉద్యోగం, చాలీచాలని జీతం, బాధ్యతలూ-ఇవన్నీ తన గత జీవితం ఒక్కసారి ఆయన కళ్ళముందు మెదిలింది.

సామాన్యమైన బడిపంతులు ఉద్యోగం, అణకువ అయిన భార్య, సగం శిథిలమైనా తలదాచుకోవటానికి పనికి వచ్చే యిల్లు అయినా, సంతృప్తితోనే బ్రతకటమే కాదు, తన పిల్లలతోబాటు పేదపిల్లలకి కొందరికి తన పిల్లల్లా దగ్గరుంచుకుని తిండీ, బట్టా యిచ్చి ప్రాణప్రదంగా చూస్తూ వాళ్ళకి విద్యతోబాటు ఉన్నత ఆదర్శాలని నూరిపోస్తూ హైస్కూలు చదువు పూర్తిచేయించారు.

అలా చదువుకున్నవాళ్ళలో కొందరు బీద విద్యార్థులు మంచి మార్కులతో స్కూలుఫైనలు పాసై స్కాలర్‌షిప్‌లు సంపాదించుకుని, కాలేజీలో చేరి, డిగ్రీలు తీసుకుని, ఉన్నత స్థితిలోకి వచ్చినవాళ్ళుకూడా వున్నారు. వాళ్ళందరిలోకీ శ్రీకాంత్ ఎమ్. ఎ. పాసై ఇంగ్లీషు లెక్చరర్ అయి అచ్చుగా వెంకట్రామయ్యగారిలా స్టూడెంట్లకి ఉన్నత భావాలని నూరిపోస్తూ మంచి లెక్చరరే కాదు, చాలా సమర్థుడూ, తెలివిగలవాడూ శ్రీకాంత్ అన్న పేరు తెచ్చు

కంటున్నాడని తెలిసిన రోజున వెంకట్రామయ్యగారు
పొందిన ఆనందం వర్ణనాతీతం. అయితే, రిటైరై పోయేసరికి
చేతిలో చిల్లిగవ్వ మిగలలేదు.

వెంకట్రామయ్యగారికి యిద్దరు కొడుకులూ, ఇద్దరు
కూతుళ్ళు. కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చేశారు. పెద్దకొడుకు మంచి
ఉద్యోగంలోనే స్థిరపడ్డా జీతం చాలదనే గొడవపెడుతూ
వుంటాడు అయినా, తల్లితండ్రులని రమ్మని ఓ ఉత్తరం
వ్రాశాడు ఎన్నో సంవత్సరాలుగా ఉద్యోగంచేసే కొడుకు
దగ్గరికి వెళ్ళి భార్యాభర్తలు నాలుగురోజులైనా వుండలేక
పోయారు.

"అసలే పిల్లలు ముగ్గురు. ఈ రెండుగదుల ఇరుకు
కొంపలో ఈ ముసలాళ్ళిద్దరు నా ప్రాణానికి. ఎలా రోజులు
గడపటం" అని గట్టిగనే విసుక్కునే కోడలుదగ్గర మరో
రోజుకూడా వుండటానికి ఇష్టపడలేదు వరలక్ష్మమ్మ
గారు.

ఇంక రెండో కొడుకు శ్రీధర్. బికామ్. పాసై కంపె
నీలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. సంపూర్ణని ప్రయి
వేటుగా పరీక్షలకి కట్టించి, బి ఎ పాస్ చేయించి తన కంపె
నీలోనే ఏదయినా ఉద్యోగంలో వేయించుకుంటే అప్పుడు
ఇద్దరి సంపాదనతో హాయిగా బ్రతకవచ్చని కలలు
కంటూ భార్యకి నూరిపోస్తూన్నాడు పాఠాలు. ఇంక సంపూ
ర్ణకి ఓ వేపు చదువు. మరోవేపు ఇంటిభాధ్యతలు. విసుగు

కలిగినూనేవున్నా పైకి ఏం మాట్లాడడు. మౌనంగా బాధని ధరిస్తూంది.

జీవితంలో ఈ నాడు ప్రతి మనిషీ ఉన్నత స్థితిలోకి రావాలని పడే తపన, అంతస్తుని పెంచుకోవాలనే ఆరాటం చూసూ ఆశ్చర్యం, ఆనందం కలుగుతూంటాయి వెంకట్రామయ్యగారికి.

అయితే, ఈ డబ్బుసంపాదన అనే వ్యామోహంలో పడి ఎంత అశాంతి కొనితెచ్చుకుంటున్నాడో మనిషి ఆలోచిస్తున్నాడా? ఇప్పటివాళ్ళు పొందే దానికంటే పోగొట్టుకునేదే ఎక్కువేమో అనిపిస్తూంది. శాంతిలేని జీవితంకంటే నరకం మరేం ఉంటుంది?

ఇదివరకురోజుల్లో ఒక్క మగాడు కష్టపడి తెచ్చినా ఇంట్లో ఎందరో వున్నా సంతృప్తిగా బ్రతకగలిగేవాళ్ళు. కానీ, ఈనాడు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటటం ఒకటేకాదు, మనిషిలోని కోరికలూ, అవసరాలూ కూడా ఆకాశాన్ని అంటిపోయి మనస్సుకి శాంతిని కరువుచేసున్నాయి. అందుకే ఇప్పటివాళ్ళలో ఇంత అసహనం కనిపిస్తూంది.

టపటపమని నాలుగు వానచినుకులు నెత్తినపడ్డ తరువాతగానీ వెంకట్రామయ్యగారి ఆలోచనలకి ఆనకట్ట పడలేదు. పార్కులోని రేడియోలోనించి తెలుగువార్తలు రావడంతో ఆయన గత జ్ఞాపకాలు పూర్తిగా పక్కకు తప్పుకున్నాయి?

"అరె! శ్రీధర్ సినిమాకి వెళ్ళాలన్నాడు కదూ? ఎంత పొరపాటు!" వెంటనే లేచి ఉత్తరీయం భుజాన వేసుకుని గబ గబా పార్కు బయటికివచ్చి, నడక వేగం హెచ్చించగానే వర్షం పెద్దదయిపోయింది బట్టలు పూర్తిగా తడిసిపోతా యిలా వుంది అనుకుంటూ ఓ పాడుబడ్డ సత్రంలోకి దూరారు. అక్కడ చాలామంది భిక్షుకులు ముడుచుకు కూర్చున్నారు. ప్రొద్దున్న హార్మనీ వాయించిన భిక్షుగాడు మోకాళ్ళమీద తలపెట్టుకొని భోరుమంటూన్నాడు. ఓ కుంటి ముసలాడు అతన్ని ఓదారుస్తున్నాడు.

"ఏమైందీ?" వెంకట్రామయ్యగారు ఆతృతగా అడిగారు, ఆ దగ్గరలోనే నిండా ముసుగుకప్పి ఉన్న ఆకారాన్ని చూస్తూ.

"ఈడిపెళ్ళాం, బాబూ! నెత్తురుకక్కుకు చచ్చిపోయింది. పాటలు పాడి ముట్టెత్తుకొచ్చేది...కొరివెట్టేందుకు కూడా దమ్మిడీలేదు ఈడిదగ్గర. ఓ వైపేమో మాయదారి ఓన."

కుంటివాడు ఆశగా వెంకట్రామయ్యగారి చెయ్యినీ, షర్టు జేబునీ మార్చి మార్చి చూస్తూ అడుగుతూంటే వెంకట్రామయ్యగారి గుండె నెవరో ఉంగచుట్టి పిండేస్తున్నట్లుంది.

"మనసే కోవెలగా! మమతలు మల్లెలుగా..." ఆ అమ్మాయి పాడిన పాట ఆయనకి వినిపిస్తూన్నట్లే వుంది.

కానీ, ఆ అమ్మాయి...నిశ్చింతగా మళ్ళీ లేవవలసిన అవసరం లేకుండా నిద్రాదేవి ఒడిలో ఒరిగిపోయింది.

జీవితం ఎంత క్షణభంగురం, ఇలాంటి జీవితంకోసం యెందుకింత వ్యామోహం? వెంట ఏదీ రాదు. రాదు.

జేబులోని రెండురూపాయల కాగితం అతనిమీదికి విసిరేసి వర్షంలో తడుస్తూనే యింటిముఖం పట్టా రాయన.

వానలో తడుస్తూ వస్తున్న మామగారిని చూడగానే కోడలు ముఖం ధుమధుమలాడిస్తూ వరండాలోంచి లోపలికి వెళ్ళిపోయింది. శ్రీధర్ పేపర్ తిరగేస్తూ ముఖం గంటు పెట్టుకు కూర్చున్నాడు.

బ్రతికిన నాలుగురోజులూ కోపాలూ తాపాలూ, కక్షలూ కార్పణ్యాలూ, ఈర్ష్యాద్వేషాలూ. ఆ తరవాత... ఏం లేదు.

ఆయన ఇలా అనుకుంటూ వాల్చిన మంచంమీద పడుకున్నారు. ఆయన యెంత మనస్సు మరల్చుకో ప్రయత్నించినా చచ్చిపోయిన భిక్షుకురాలు పదే పదే గుర్తొస్తూంది. అప్పైన శ్యామ్ జ్వరం యెప్పటికి తగ్గుతుందో! ఈ ఆలోచనల్లో సతమతమాతూ ఆయన కళ్ళు గట్టిగా మూసుకుపడుకున్నారు. కానీ, శ్రీధర్‌కి మాత్రం తండ్రి ప్రవర్తనకి చిర్రెత్తుకొచ్చింది.

"సినిమాకి వెడదాం, ఇంట్లో ఉండాలి అని చెప్తే

ఒక్కరోజు షికారు మానేయకపోవటం కాక పైగా ఏడింటికి ఇంటికొచ్చి పోనీ యెందువల్ల ఇంటికి రాలేకపోయారో అయినా ఒక్కమాట చెప్పకుండా యెలా పడుకున్నారో! ఇంతే యీ పెద్దవాళ్ళు. అన్నయ్యా, వదిన లాంటివాళ్ళే వీళ్ళతిక్క కుదర్చగలరు. మేం యెంత ఓర్పుగా వున్నా గుర్తింపులేదు" అనుకుంటూ విసురుగా లోపలికి లేచి వెళ్ళిపోయాడు.

◆ ◆ ◆

వెంకట్రామయ్యగారు ఇంటికి త్వరగా యెందుకు రాలేకపోయిందీ కారణం చెప్పాలని అనుకున్నారు. కానీ, శ్రీధర్ యేమాత్రం అవకాశం యివ్వకుండా ముక్తసరిగా మాట్లాడేస్తూండటంతో ఆయన చెప్పలేకపోయారు. రాత్రి పొద్దుపోయేవరకూ కోడలు సాధించడం సన్నసన్నగా విని విన్నూనే వుండి ఉదయం అవకాశం లేకుండానే కంపెనీకి వెళ్ళిపోయారు. ఇలా అప్పుడే నాలుగురోజులు గడిచిపోయాయి, అయినా, ఇంత చిన్న, విషయం ఇంత పెద్దదిచేసి అలా ముఖం మాడ్చుకునే కొడుకు తను ప్రాణంలో ప్రాణముగా పెంచిన శ్రీధరేనా అనిపిస్తూంది ఆయనకి. 'అసలు వాడికి నేను సంజాయిషీ ఇవ్వాలా? ఏమిటో..."

ఆయనకి చాలా విసుగ్గా గడిచాయి మరో వారం రోజులు.

ఈ నిశ్శబ్దాన్ని భరించటం చాలా కష్టంగానే వుంది.

శ్రీధర్‌కి ఒకరో యిద్దరో పిల్లలయినా వుంటే కాస్త కాలక్షేపంగా వుండేది. అయితే శ్రీధర్‌కీ, కోడలికీ ఇప్పుడప్పుడే పిల్లలు అక్కరలేదు. అందుకే కలగకుండా జాగ్రత్త పడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో సంతోషంగా, హాయిగా గడిచే టైము వెంకట్రామయ్యగారికి సాయంకాలం షికారు టైములో పార్కులో ఆ పసిహృదయాల సన్నిధిలో, తన కోసం ఎదురుచూసే ఆ పిల్లల పరిచయం క్రమక్రమంగా పెరిగి విడిపించుకోలేని బంధం అవుతూంది. బంధంలా వున్నా దానిలో యేదో తెలియని మాధుర్యం లభ్యమవుతూంది, అరవై యేళ్ళ వెంకట్రామయ్యగారికి. ఆ ముగ్గురు పిల్లలలోనూ శ్యామ్ ప్రాణంగా తయారైనాడు. జ్వరం తగ్గలేదని తెలిసి గోపీని వెంట తీసుకుని వాళ్ళ ఇంటికి వెళ్ళి చూసి రావటం అలవాటైపోయింది వెంకట్రామయ్యగారికి.

శ్యామ్‌కి చాలా ప్రమాదమే చేసింది. కాని మెల్లగా బయటబడ్డాడు. జ్వరం తగ్గాక పథ్యం పెట్టింది శాంత. అయితే, శ్యామ్ యింకా కోలుకోనే లేదు. శాంత జ్వర పడింది. ఇది మామూలు జ్వరం కాదు, విషజ్వరం అన్నాడు డాక్టర్. శాంత దగ్గర ఉన్న కాస్త డబ్బూ శ్యామ్ సు సీకే సరిపోయింది. రోజులు గడవటం కష్టమై, ఇరుగూ, పొరుగూ శాంతని గవర్నమెంటు హాస్పిటల్‌లో చేర్పించారు. శాంతకి నా అనేవారు సరే, ఆత్మీయులైనా, స్నేహితులన్నా లేరు, ముక్కుపచ్చలారని పసికందు శ్యామ్ తప్ప.

తండ్రి ఇలా ఎవరో అనాధ స్త్రీకి సాయపడటం అసలు నచ్చలేదు కొడుక్కీ, కోడలికీ. ప్రపంచం గొడ్డుపోయిందా? ఎందరో నిరాశ్రయులున్నారు. వాళ్ళందరికీ మనం ఏం చెయ్యగలం? ఇదే కారణంకాదు. ఏదో ఉంది అని లోకులంతా కాకుల్లా అనుకుంటున్నారని శ్రీధర్ ఇంటికివచ్చి కల్లు తాగిన కోతిలా గంతులేస్తున్నాడు. తండ్రిని తప్పుపట్ట లేదు; అడిగేవాళ్ళకి జవాబివ్వ లేదు.

సంపూర్ణ మెల్లగా మరో కొత్తవిషయం చెప్పింది.

"అత్తగారి బంగారు గాజు ఒకటి విరిగిపోయిందని ఇక్కడే పెట్టెలోవుంచి వెళ్ళారు. అది తీసుకువెళ్ళారు నిన్న మీ నాన్నగారు. నిన్న ఉదయం ఎనిమిది గంటలకి వెళ్ళి ఈ వేళ యిప్పటివరకూ రాలేదు. ఇలా ఆయన చేస్తూంటే మీరు చూస్తూ ఊరుకోవటమేనా? నాకేం బాగాలేదు .."

శ్రీధర్ ఈ విషయం వింటూ మరీ ఎగిరెగిరి పడుతున్నాడు.

"అమ్మని రమ్మని ఇప్పుడే ఉత్తరం రాసేస్తాను. అసలిలాంటి పనులు ఆయనకి ఎందుకో ఆవిడనే అడిగి తేల్చుకోమంటాను అసలు ఇలా ప్రవర్తిస్తే నా దగ్గర ఉండటానికి వీల్లేదంటాను."

శ్రీధర్ ఆవేశంగా ఇంకా ఏదేదో అనేస్తూ, "అమ్మకిప్పుడే ఉత్తరంరాసి పడేస్తాను, వెంటనే బయలుదేరమని" అంటూండగానే—

"అక్కర లేదురా! నేను యిందాకే టెలిగ్రామ్ ఇచ్చాను, వెంటనే వచ్చేయమని. నీ కంత శ్రమకూడా అక్కరలేదు" అన్న తండ్రిమాట వినిపించింది. అప్పటికి చాలాసేపటినించీ నిలిచివున్నట్లు ఆయన ముఖమే చెబుతూంది. నల్లగా మాడిపోయిన ముఖం...మాసిపోయి తడిసిన పంచె, తడిసిన ఉత్తరీయం, వర్తు భుజంమీద వ్రేలాడుతూంటే ఆరేళ్ళ శ్యామ్ ఏడ్చి ఏడ్చి కాబోలు వెంకట్రామయ్యగారి మరోభుజంమీద సొమ్మసిల్లి పడుకునివున్నా మధ్య మధ్య వెక్కుతూనే ఉన్నాడు. శ్యామ్ వీపుని ఆత్మీయంగా నిమురుతూ నిలుచున్న తండ్రిని చూసిన క్షణంలో శ్రీధర్ గుండె క్షణం గబగబా కొట్టుకొంది. కానీ, అంతలోనే ఆయన అంటే నిర్లక్ష్యం కూడా కలిగింది. తండ్రి వైపు ఒక్కసారి తీక్షణంగా చూసి గదిలోకి వెళ్ళిపోయాడు.

వెంకట్రామయ్యగారు చాలా నిబ్బరంగా వచ్చి తన మంచంమీద శ్యామ్‌ని పడుకోబెట్టి దగ్గర కూర్చున్నారు... సంపూర్ణ క్షణంలో ఆయన స్థితి గ్రహించేసింది. భర్తకి చెప్పేసింది, మెల్లని స్వరంతో.

"బహుశా ఆ మహాతల్లి 'హరీ' మని ఉంటుంది. ఆ కొడుకు బాధ్యత మన నెత్తిమీద వేసి చేతులు దులుపుకోవాలని కాబోలు దారేపోయే తద్దినాన్ని మన యింటికి తెచ్చారు. నే నిలాంటివి చచ్చినా సహించను. ఆ పిల్లాడి యింట్లో ఒక్క క్షణంకూడా ఉండటానికి వీల్లేదు. నాకు

చికాకొచ్చిందంటే మనిషినికాను. మీ ఇష్టం ఇంక, నాకు నాలుగుసార్లు చెప్పే అలవాటులేదు" అంది ఖచ్చితంగా.

భార్యాభర్త లిద్దరూ దాదాపు మరి రెండుగంటల వరకూ ప్రక్క గదివదిలి బయటకు రాలేదు. ఎంతసేపటికీ తండ్రి గదిలోంచి ఏమాత్రం అలికిడి వినిపించక ఈయన ఆకలి మరిచి నిద్రపోతున్నారా, లేక అన్నం పెట్టమని అడిగేందుకు ముఖంచెల్లలేదా? అని శ్రీధర్ అడుగులో అడుగు వేస్తూ తొంగి చూశాడు. మంచంమీద శ్యామ్‌కానీ, ఆ గదిలో మరెవ్వరూ కానీ కనిపించలేదు.

"నాన్నా..." వాకిట్లోకి వెళ్ళాడు అన్నీ మరిచిపోయి.

అప్పటికే వెంకట్రామయ్యగారు ఓ భుజంమీద శ్యామ్‌ని పడుకోపెట్టుకొని మరో చేతితో చేతిసంచీ పట్టుకుని ఆ దీర్ఘమైన మెయిన్‌రోడ్ మీదనుంచి స్టేషన్‌వైపు వెళ్ళిపోతున్నారు. శ్రీధర్..."నాన్నా!" అంటూ అలాగే నిలిచిపోయాడు. సంపూర్ణ ఉత్తరం తీసుకుని విప్పి చదువుకుంటూంది.

"నేను పాతకాలం వాడిని. ఇప్పటి సమాజానికి అనుగుణంగా నడుచుకోవటం తెలియనివాడిని. నీకేదన్నా బాధ కలిగిస్తే క్షమించమని అడగను. ఎందుకంటే నువ్వు నా కొడుకువి కనక.

ఈ 'శ్యామ్' బాధ్యత నీ మీద వేయాలనే ఉద్దే

క్యంతో కాదు నే నీ పసివాడిని తీసుకొచ్చింది. ఏ దిక్కూ లేని ఓ అనాథ స్త్రీ - అందునా ఒక ముక్కుపచ్చలారని పసికందుకి తల్లి అవసానదశలో మరెవ్వరూ దగ్గర లేక, ఉన్నా ఈ బాధ్యతని తీసుకోగలిగినవాళ్లు లేక నా చేతుల్లో వుంచి ప్రశాంతంగా కళ్ళు మూసిందా నిర్భాగ్య స్త్రీ. ఆమె ఎవరో? నేనెవరో? నిజమే, నే నీ బాధ్యతని మోయాలని, మోసే శక్తి ఉందనీ కావాలని వేసుకోలేదు. అనుకోకుండా... భగవంతుడు ఈ కొత్త బంధాన్ని బిగించాడు. అయితే తెంచుకుంటే పోదా అని - నీ వనవచ్చు.

కానీ, శ్రీధర్! శ్యామ్ అమ్మ, అదే శాంతకి నేను మాట యిచ్చాను. 'నీ చిన్నారి బాబుకి మరేం ఫర్వాలేదు. నేనున్నానమ్మా, శాంతమ్మ తల్లీ, నిశ్చింతగా నిద్రపో' అన్నాను. అయితే శాంత ఇంక మరి మేలుకోదనీ, తృప్తిగా కళ్లు మూసేస్తుందనీ అనుకోలేదు. ఇది భగవంతుడి ఇచ్ఛ. అన్ని బంధాలనీ వదిలించుకొని మయుస్సు మళ్ళి, కృష్ణా రామా అనుకునే ఈ వయస్సులో మరి ఈ కొత్తబంధంతో భగవంతుడు ఎందుకు బంధించాడో ఆ విధాతకే తెలియాలి. అయితే, నే నీ బాధ్యతని సంతోషంగా స్వీకరిస్తూ ఈ చిరు మొలకని పెంచి పెద్దచేయడానికే మన స్వగ్రామం వెళ్ళిపోతున్నాను. అమ్మని అక్కడికే రమ్మని టెలిగ్రామ్ కూడా ఇచ్చేశాను.

శాంత దహన క్రియలకుగాను సగంవిరిగిన బంగారు గాజు అమ్మేశానంటే మీ అమ్మ మారు మాటాడదని

ముప్పై ఏళ్ళ దాంపత్య జీవితం నాకు ధైర్యాన్నిచ్చింది. మళ్ళీ కొత్త జీవితానికి నాంది పలకటానికే నా జన్మస్థలానికి వెడుతున్నాను, అంతే.

—నీ తండ్రి."

భార్య చేతిలో ఉత్తరం లాక్కుని గబగబా చదివేసిన శ్రీధర్ రెండు చేతులతోనూ ముఖం దాచేసుకుని మంచంమీద కూలబడ్డాడు.

"నాన్నా...మేం ఈ తరానికి వారసులం. మీ వ్యక్తిత్వాన్ని, ఆత్మాభిమానాన్ని గుర్తించలేని నీ కొడుకునని చెప్పుకొనటానికే సిగ్గుపడుతున్నాను. నా తొందరపాటుతనానికీ, ఓర్పులేనితనానికీ మంచి శిక్షే విధించి వెళ్ళిపోయారు..." శ్రీధర్ కన్నీళ్ళు టపటపా క్రింద పడుతున్నాయి. సంపూర్ణ తన తప్పు గ్రహించి ముఖం పమిటతో దాచేసుకుంది, భర్త ముఖంవైపు చూడలేక.